# కిటుకు

బులుసు జీ ప్రకాష్

సరస్వతి అని పేరుపెడితే చదువులు రాకపోవచ్చు. పద్మాక్షికి మెల్లకన్నుండ వచ్చు. లలిత అనంటే మొరటుగా వుండొచ్చు. కాని పాతికేళ్ళ సన్నమ్మ నిజంగా సన్నమ్మే! సన్నంగానూ, నాజూకు గానూ వుంటుంది. సన్నమ్మ తండ్రి పౌరాణికుడు. దేవాలయాలలో పురాణ కాలక్షేపం చేస్తూ కాలం వెళ్ళబుచ్చుతూం టాడు.

సన్నమ్మకి తల్లి లేదు. ఏకైక పుత్రిక. తండ్రికి తానే వంటచేసి పెడుతుంది. యుక్తవయస్సులో వున్న కుమార్తెకి పెళ్ళి చేద్దామనే తహతహ ఏ తండ్రికైనా వుం టుంది. అలాగే సన్నమ్మ తండ్రికీని. కాని ఆర్థిక పుష్టి చాలదు. కట్నం మాట దేవుడెరుగు, కనీసం ఒక్కపూటైనా పప్పు అన్నం పెట్టలేనివాడు,




తండ్రి ఏ దేవాలయంలో పురాణం చెప్పినా అంద రితోపాటు తనుకూడా వినేది. పౌరాణిక గాథల్లో సన్నమ్మని అతిగా ఆకట్టుకున్నది గజేంద్ర మోక్షము. "లా వొక్కింతయు లేదు ధైర్యము విలోలంబయ్యే" అన్న భక్త పోతన్న పద్యం అంటే సన్నమ్మ తన్మయత్వం చెందిపోతుంది. మొరపెట్టగా పెట్టగా, మహావిష్ణువు గజేంద్రుణ్ణి రక్షించినట్టే తనను కూడా రక్షిస్తాడని సన్నమ్మ నమ్మకం. గజేంద్రుడు ఆపదలో వున్నట్టు-సన్నమ్మ ఆపదలో వుందా అంటే - వుంది. తండ్రి చూస్తే ఒక పేద పౌరాణికుడు. నేడో రేపో వృద్ధాప్యం చేత కాలం చెయ్యొచ్చు.

మధ్యాహ్నాల వేళ ఇంటి దగ్గర గజేంద్రమోక్షం కథా. పద్యాలను సన్నమ్మ భక్తి పారవశ్యంలో చదువుతూంటే ఆ వీథిలో వున్న అమ్మలక్కలందరూ విని తన్మయత్వం చెందేవారు.

కొన్ని వేల సంవత్సరాలు గడిచేక గజేంద్రుణ్ణి విష్ణువు కరుణించినట్టు కాక, కలియుగ కాలమానం ప్రకారం పదిహేనేళ్ళలోనే కనికరించేడు కనకచేలుడు. ఇప్పుడు సన్నమ్మకి నలభై దాటేయి.

మదరాసులో మంచి ఆఫీసరు హోదాలో వున్న 45- 50 ఏళ్ళ మధ్య వయస్కునికి భార్య చనిపోయింది. ఇంట్లో వలలునివంటి పాకశాస్త్ర ప్రవీణుడున్నాడు. అతన్ని పెళ్ళి చేసుకుంటావా అని ఓ మధ్యవర్తి అడిగిందే తడవుగా, సన్నమ్మ అంగీకరించింది. రెండో పెళ్ళివాడు అయితే అయేడు, రెండు పూటలా

కడుపునిండా ఇంత అన్నం పడేస్తాడు కదా అని సన్నమ్మ ధీమా. అదే ఆమె జీవిత భీమా!


* * *

ఇప్పుడు సన్నమ్మ మదరాసు నివాసిని. ఆదర్శ గృహిణి. బొజ్జ నిండా బువ్వ. కావలసినప్పుడల్లా టిఫిన్లు. ఇంట్లో కాల్‌గాస్ స్టౌ. ప్రెషర్ కుకర్. రేడియో వీడియో. ఒక్క ఏసీ తప్ప సమస్త ఆధునిక సౌకర్యాలు ఇంట్లో వున్నాయి. రోజూ సాయంత్రం వేళ వాళ్ళాయన స్కూటర్ మీద వాహ్యాళి తీసుకెళతాడు. ఇహ సిని మాలు, ఎగ్జిబిషన్లు, షాపింగ్ - సన్నమ్మ ఎప్పుడు కోరుకుంటే అప్పుడే!

ఈనాడు సన్నమ్మకి చీకూ చింతా లేదు. తనివి. అన్నింటినీ మించిన తృప్తి. సమాజంలో తనకొక గౌరవ స్థానం. భర్త అండదండలు.

ఇప్పుడు సన్నమ్మ 'సన్న'మ్మ కాదు. 'లావ'మ్మ. మానసిక సౌఖ్యమే అందుక్కారణం. కాటాలో వెయ్య కుండానే రెండొందల కేజీలుంటుందని ఎవరైనా ఊహించవచ్చు. మిగిలిన శరీరమూ, శీర్షమూ కలిసి పోయేయి. మెడ అస్సలు కనబడ్డం లేదు!

మూడేళ్ళు గడిచేక సన్నమ్మకి చెందిన గ్రామంలోని అమ్మలక్కలు కొందరు రైల్వే సర్క్యులర్ టిక్కెట్స్ తీసుకుని యాత్రలు చేస్తూ మదరాసు చేరుకున్నారు.




మన సన్నమ్మ ఎలా వుందో అని తలుపు తట్టేరు.

"నేనే సన్నమ్మని సిస్సీ!" అని సన్నమ్మ స్వయంగా చెప్పేవరకూ అమ్మలక్కలు నమ్మలేకపోయారు.

"అయ్యో! ఎంతలా చిక్కిపోయేవే సన్నమ్మా!" అని ముక్కుల మీద వేళ్ళేసుకున్నారు అమ్మలక్కలు; లావెక్కేవంటే దిష్టి తగుల్తుందనుకుంటుందేమో అని.

సన్నమ్మ వాళ్ళకి తన ఇల్లంతా చూపించింది.

సన్నమ్మకి గల అత్యాధునిక సౌకర్యాలకు ముగ్ధులై పోయేరు అమ్మలక్కలు. వారికి ప్రియాతిప్రియమైన పిండివంటలు-అరిసెలు, మినప సున్నుండలు, జంతికలు, చేగోడీలు, చక్కిలాలు, పాలకాయలు వంటవాడిచేత చేయించింది సన్నమ్మ. "ఎంతదృష్టవంతురాలివే తల్లీ!" అని అమ్మలక్కలు ముచ్చటపడిపోయారు.

"సన్నమ్మా! నువ్వు గజేంద్ర మోక్షం అను నిత్యమూ వినిపిస్తూ, తన్మయత్వం చెందుతూ, మమ్మల్ని భక్తిపారవశ్యంలో ముంచేదానివి. ఏదీ మరొక్క సారి, నీ నోటిద్వారా ఆ కథని మాకు వినిపించవే అమ్మా!" అన్నారు అమ్మలక్కలు.

"నాకిప్పుడు ఆ పురాణాలు చదవడానికి ఓపికా, తీరికా ఎక్కడివర్రా? నన్ను మరి చంపకండి!" అంది సన్నమ్మ ఆవలిస్తూ చిటికెలు వేస్తూ—

అసలు కిటుకు ఏమిటంటే, సన్నమ్మ విపరీతంగా లావెక్కింది. గజేంద్రమోక్షంలోని 'లావొక్కింతయు లేదు...' అనే పద్యాన్ని ఏ మొహంతో చదువుతుంది?

●

## మినీ కథ

# నిరాహారదీక్ష

పదేళ్ళ రాము ఒక రోజు స్కూలుకు వెళుతూ "అమ్మా! మా బడి దగ్గర పిల్లలంతా ఐస్‌క్రీమ్స్ తింటున్నారు. నాకో పావలా ఇయ్యవా!" అనడిగాడు గోముగా.

"లేదు నాన్నా! ఇవ్వాళ అన్నంలోకి పచ్చడేం చేయాలో ఆలోచిస్తున్నా! రేపుగాని, ఎల్లుండిగాని నాన్నకు చెప్పి ఇప్పిస్తాలే!" అంది తులసి.

పరమ సంతోషంగా పరుగులంకించాడు రాము.

నాలుగు రోజుల తర్వాత 'నాకో అర్ధ రూపాయి ఇయ్యవా!" అనడిగాడు తల్లిని రాము.

"ఏమిట్రా మొన్న పావలా అడిగి, ఈ రోజు అర్థ రూపాయి అంటున్నావు!" అంది తులసి.

"మరేం లేదమ్మా! మా బడి దగ్గర ఈ రోజు చెరకురసం బండి వచ్చింది. ఒక గ్లాసు అర్థ రూపాయి... అందుకని!" సమాధానమిచ్చాడు.

కన్నబిడ్డ చిన్నపాటి కోరిక తీర్చలేని తన స్థితికి తానే జాలిపడిందా తల్లి.

"అలాగే నాన్నా! నాన్నకు చెప్పి ఇప్పిస్తాగా!" అంది బాధను దిగమింగుతూ!

మరో నాలుగు రోజులు గడిచాయి. తులసి భర్త చిరిగిన చొక్కాను కుడుతూ కూర్చుంది. రాము వచ్చి నిల్చున్నాడు.

తులసి తలెత్తి చూసి "ఏం నాన్నా!" అంది.

"మరి!" అన్నాడు మెల్లగా.

"అర్థ రూపాయేనా! నాన్నతో చెప్పాను... ఇస్తా మన్నారు. రెండు రోజుల్లో తప్పకుండ ఇస్తామన్నారు. నీ బుజ్జి బొజ్జను చెరకురసంతో నింపుదువుగాని!" అంది నవ్వుతూ.

"అది కాదమ్మా!"

"మరేం కావాలి".

"బడి పిల్లలంతా కొబ్బరి బొండాలు తాగుతున్నారు. మరెప్పుడూ అడగను. చెరకురసం కంటే బాగుంటా యట! నేనొక్కటి తాగొద్దా! రెండురూపాయిలన్నారు!"

పసివాడి మాటలు విన్న తులసి హృదయం తరుక్కు పోయింది. తన భర్త ఒక చిల్లర కొట్లో చిన్న గుమస్తా. వాళ్ళిచ్చే రెండు వందలతో ఇంటి అద్దె, కుటుంబ ఖర్చులు జరగాలి. అత్తా మామలు మంచంలోంచి కదల్లేని స్థితి. వారిని కనిపెట్టుకొని తను ఎల్లప్పుడు ఇంట్లోనే వుండాలి. లేకపోతే తనుకూడా ఏదో ఒక చిన్నపని చేసుకోగలదు. భర్త మరి ఏ ఇతర శారీరక శ్రమకు సంబంధించిన పని చేయలేడు... కొన్ని క్షణాలు మౌనం వహించి "అట్లాగే నాన్నా" అంది.

అనుక్షణం తులసి "కన్నబిడ్డ కోరిక ఎలా తీర్చాలా" అని ఆలోచిస్తోంది. భోజనం కూడా అర్థాకలితోనే గడుస్తుందాయె.

వారం రోజుల తర్వాత పుస్తకాల సంచి చంకకు తగిలించుకొని పరుగున వచ్చాడు రాము.

బిడ్డ ముఖంలోకి చూడలేక తులసి తలదించుకుంది.

రెండు నిమిషాల తర్వాత రాము తటపటాయిస్తూనే పలకరించాడు.

"అమ్మా"

తలెత్తి 'ఏం' అన్నట్లు చూసింది.

"నాకు డబ్బులు వద్దమ్మా"

"ఎందుకని?"

"నిరాహారదీక్ష చేస్తున్నాను."

"ఏమిటి బాబు నువ్వనేది. కొబ్బరిబొండా కొనడానికి డబ్బులివ్వలేదనే కోపంతో అలిగి నిరాహార దీక్ష చేస్తావా. తప్పు కదూ" అంది తులసి బాధను దిగమింగి.

"ఛ! అదేం కాదమ్మా."

బజార్లో ఎవరో రోడ్డు మీద నిరాహారదీక్ష శిబిరం వేశారట. అందులో కూర్చున్నవాళ్ళకి పొద్దున్నే భోజనం పెట్టించి, ఐస్‌క్రీమ్స్, చెరకురసం, కొబ్బరి నీళ్ళు, నారింజ రసం ఇప్పించి, రోజుకు పది రూపాయి లిస్తున్నారట. రేపు ఆదివారం బడి లేదుగా. నేనెళ్ళొద్దా శిబిరానికి" అన్నాడు అమాయకంగా బతిమలాడే ధోరణిలో.

తులసి అవాక్కయి రాము ముఖంలోకి చూస్తుండి పోయింది.

●

కెప్టెన్ షేక్ మౌలాలి.